సాక్షి చిత్తూరు
బుధవారం । 21 । మే । 2025



కుంకీలతో కట్టడయ్యేనా!

ఏనుగుల దాడులను కట్టడి చేసేందుకు తీసుకొస్తున్న కుంకీ ఏనుగులు గురువారం జిల్లాకు రానున్నాయి. - 8లో



కిలాడీ బావాబామ్మర్దులు

చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్న కిలాడీ బావాబామ్మర్దులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. - 8లో



ఎర్రచందనం పట్టివేత

పోలీసులు జరిపిన దాడిలో ఇద్దరు నిందితులను పట్టుకొని ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు కుప్పంకు సీఎం

– షెడ్యూల్ వివరించిన కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం కుప్పం పర్యటనకు రానున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. కలెక్టర్ మంగళవారం సీఎం పర్యటన షెడ్యూల్‌ను వెల్లడించారు. సీఎం బుధవారం మధ్యాహ్నం బెంగళూరు విమానాశ్రయం నుంచి హెలిక్యాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు గుడుపల్లి మండలం ద్రవిడ యూనివర్సిటీకి చేరుకుంటారన్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి కుప్పం లోని ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర వేడుకల్లో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 1.40 గంటలకు ద్రవిడ యూనివర్సిటీ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుని మధ్యాహ్నం 2.30 గంటలకు బెంగళూరు విమానాశ్రయానికి వెళ్తారని కలెక్టర్ తెలిపారు.

రేపు అర్ధగిరిలో హనుమాన్ వేడుకలు



తవణంపల్లె : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో 22వ తేదీన గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ హనుమంతురావు తెలిపారు. ఉదయం స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహిస్తామన్నారు. 10 గంటలకు సుదర్శన హోమంను శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని వివరించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు కార్పొరేషన్ : విద్యుత్ సమస్యలను సకాలంలో పరిష్కరించాలని విశ్రాంత జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి ఆదేశించారు. మంగళవారం తిరుపతి ట్రాన్స్‌కో డిస్కం కార్యాలయం నుంచి వీడియో సమావేశం చిత్తూరు రూరల్ డివిజన్ అధికారులతో మాట్లాడారు. గతంలో అందిన పలు సమస్యల పై ఈ సందర్భంగా చర్చించారు. గతంలో ఆ డివిజన్ నుంచి కరెంటు స్తంభం మార్పు, బిల్లింగ్ సమస్యలు, వ్యవసాయ సర్వీసులు జారీ, లైన్ షిఫ్టింగ్ వంటి 6 సమస్యలు వచ్చాయన్నారు. అందులో ఒక బిల్లింగ్ సమస్య మాత్రమే పరిష్కారం అయిందన్నారు. మిగిలిన సమస్యలను 15 రోజుల్లోపు పరిష్కరించాలన్నారు.

బెల్లం రైతుకు బేడీలు





బెల్లం తయారీలో రైతులు

కూటమి ప్రభుత్వం జిల్లాలో బెల్లం సాగు చేసే రైతుకు బేడీలు వేస్తోంది. సాక్షాత్తు సీఎం ఇలాకాలో బెల్లం సాగు చేసే రైతులు జైలు ఊచలు లెక్కపెడుతున్నారు. వారు దొంగతనం, హత్యలు చేయలేదు. కానీ అలాంటి వారికి వేసే శిక్షలు ఆరుగాలం శ్రమించే అన్నదాతకు పడేలా చేస్తుండడం విస్మయానికి గురిచేస్తోంది. బెల్లం సాగు చేసే రైతులు బెల్లం అమ్మడం నేరమా? బెల్లం తీసుకొని పోయినవారు సారా కాస్తారా.. కాఫీ చేసుకుంటారా రైతుకు ఎలా తెలుస్తుంది? కానీ సారా కాసే వాళ్లను వదిలేసి.. బెల్లం సాగు చేసే రైతులను జైలుపాలు చేస్తుండడంపై అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

- నల్లబెల్లం పేరిట అన్నదాతల అరెస్టులు
- సారా తయారీకి బెల్లం విక్రయిస్తున్నారని సంకెళ్లు
- జిల్లా వ్యాప్తంగా రైతుల అరెస్టులు.. నోటీసులు
- రైతులకు 'కూటమి సర్కారు' ఝలక్
- ట్రేడర్లకే విక్రయించాలంటున్న ఎక్సైజ్ పోలీసులు

చిత్తూరు అర్బన్ : జిల్లాలో రైతులు పండించే ప్రధాన పంటల్లో చెరకు ఒకటి. ఇక్కడి నల్లరేగడి భూముల కారణంగా చాలా వరకు బెల్లం నలుపు రంగులో తయారవుతుంది. కొన్ని రకాల రసాయనాలు, ప్రాసెసింగ్ చేస్తే బెల్లం రంగు మారుతుంది. కానీ గిట్టుబాటు ధర దక్కదు. దీంతో చాలా మంది నల్లబెల్లాన్ని తయారు చేసి మండీలు, అవసరం ఉన్న వాళ్లకు, ట్రేడర్లకు అమ్ముతున్నారు. ఇదే ఇప్పుడు రైతుల పాలిట శాపంగా మారింది. నల్లబెల్లం తయారీ, విక్రయాలపై కూటమి ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఆంక్షలు అతిక్రమిస్తున్న అన్నదాతలను నిర్దాక్షిణ్యంగా అరెస్టు చేసి జైలుకు పంపుతోంది. ప్రభుత్వ చర్యలపై రైతులు, రైతు సంఘం నేతలు మండిపడుతున్నారు.

'ఈ చిత్రంలో భార్య, బిడ్డలతో తన చెరకు తోట, ట్రాక్టర్‌తో కలిసి ఉన్న రైతు పేరు పెరుమాల్. గతేడాది ఆయుధపూజ నేపథ్యంలో చెరకు పంట ఓ మోస్తరుగా వస్తుండడంతో ఇలా ఫొటో తీసుకున్నాడు. కానీ ఇప్పుడు పెరుమాల్ చిత్తూరు జిల్లా జైలులో ఊచలు లెక్కిస్తున్నాడు.. కారణం.. పెరుమాల్ రైతు కావడం, తన వద్ద నల్ల బెల్లం కొన్న వ్యక్తులు సారా తయారు చేశారంట.'



కుటుంబ సభ్యులతో చెరకు పంట వద్ద రైతు పెరుమాల్

నవోదయంలో చీకట్లు

నాటుసారా తయారీ, విక్రయాలను అరికట్టడానికి కూటమి ప్రభుత్వం నవోదయం 2.0ను తీసుకొచ్చింది. సుదీర్ఘకాలంగా సారా తయారు చేస్తున్న కుటుంబాలను ఆ ఊబి నుంచి బయటపడేసి, వాళ్ల జీవన ప్రమాణాలు మార్చడానికి రుణాలు, ఇతర ప్రత్యామ్నాయ పనులను కల్పించాల్సిన ప్రభుత్వం రైతులపై పడింది. నాటు సారా తయారీకి నల్ల బెల్లం తప్పనిసరిగా వాడతారని, నల్లబెల్లం తయారు చేస్తున్న రైతులపై నిఘా ఉంచాలని, ఎవరెవరికి నల్లబెల్లం విక్రయిస్తున్నారు..? కొనుక్కునే వ్యక్తి ఆధార్ తీసుకున్నారా..? కిలో ఎంతకు అమ్ముతున్నారు..? అయిదు కిలోలకు పైబడి ఎవరికి అమ్ముతున్నారు..? అని వివరాల సేకరిస్తున్నారు. వాస్తవానికి బెల్లం తయారు చేసిన రైతులు దాన్ని మార్కెట్‌కు తరలించాలంటే తన రవాణాకు కిలోకు రూ.3, మార్కెట్‌లో కమిషన్ రూ.3 అదనపు సుంకంగా చెల్లించాలి. తీరా బెల్లాన్ని విక్రయించిన తరువాత తన పెట్టుబడి దక్కని పరిస్థితి. దీంతో కొందరు రైతులు బెల్లాన్ని మార్కెఫెడ్‌లో విక్రయించడంతో పాటు గ్రామాల్లో అమ్ముతుంటారు. రైతుల నుంచి బెల్లాన్ని కొన్నవాళ్లు దాన్ని ఫ్యాక్టరీలకు వాడతారో.. పశువులకు దాణాగా ఉపయోగిస్తారో అన్నదాతలకు తెలియదు. కానీ ఎవరైనా సారా తయారు చేస్తూ పట్టుబడితే, నిందితులు చెప్పిన మాటలను పరిగణలోకి తీసుకుని బెల్లం విక్రయించారనే నెపంతో రైతులను అరెస్టు చేయడం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది.

గిట్టుబాటు ధర ఎక్కడ ?

జిల్లాలో దాదాపు 5 వేల హెక్టార్లలో చెరకు పంట సాగువుతోంది. ఇందులో చిత్తూరు నియోజకవర్గంలోని గుడిపాల, రూరల్, నగరి, నింద్ర, విజయపురం, గంగాధర నెల్లూరు, కార్వేటినగరం, పెనుమూరు, పుంగనూరు, పులిచెర్ల, ఎస్.పురం, వెదురుకుప్పం మండలాల్లో చెరకు పంట ఎక్కువగా పండిస్తున్నారు. వీటిల్లో 4500 హెక్టార్లలో పండే పంటను ఫ్యాక్టరీలకు విక్రయిస్తుండగా మిగిలిన 500 హెక్టార్ల నుంచి బెల్లం తయారీ చేస్తున్నారు. ఒక హెక్టారుకు 70 టన్నుల వరకు బెల్లం తయారు చేస్తున్నారు. ఇందులో దాదాపు 5 వేల టన్నుల వరకు నల్లబెల్లం ఉత్పత్తి అవుతోంది. కిలో నల్లబెల్లాన్ని మార్కెట్‌లో ట్రేడర్లకు విక్రయిస్తే రూ.24–27 మధ్య ధర వస్తుంది. ఇందులోనే రవాణా చార్జీలు, దళారుల కమీషన్లు పోనూ చేతికి రూ.15 దక్కడం గగనంగా మారుతోంది. గత ప్రభుత్వ హయాంలో నల్లబెల్లానికి గిట్టుబాటు ధర కల్పించిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం.. మార్కెఫెడ్ ద్వారా బెల్లాన్ని కొనుగోలు చేయిస్తూ రైతులను ఆదుకుంది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యింది.



చెరకు పాలు కాగబెడుతున్న రైతు

సారాకు బెల్లం విక్రయిస్తే అరెస్టు తప్పదు



సారా తయారీకి నల్ల బెల్లాన్ని విక్రయిస్తే చట్టపరంగా ముందుకు వెళతాం. సారా తయారీ వాళ్లకు బెల్లం అమ్మారని తెలిసాకే అరెస్టు చేశాం. నవోదయంలో భాగంగా నాటు సారా తయారీ అరికట్టడానికి ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సదస్సులు నిర్వహించి, బెల్లం వ్యాపారులు, రైతులకు అవగాహన కల్పించాం. ఫ్యాక్టరీలు, పశువుల కోసం నల్లబెల్లం అమ్మితే పర్లేదు. సారా కోసం అమ్మితే మాత్రం అరెస్టు తప్పదు. – శ్రీనివాస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, చిత్తూరు

అరెస్టులపై ఉద్యమిస్తాం



ఎక్కడైనా సారా తయారు చేసే వాళ్లను అరెస్టు చేస్తారు. కానీ ఇక్కడ బెల్లం తయారు చేసే రైతులను అరెస్టు చేస్తున్నారు. ఇదెక్కడి న్యాయం.? నాటుసారా పేరిట రైతులను అరెస్టు చేసి జైలుకు తరలిస్తున్నారు. పొలాన్ని నమ్ముకున్న కుటుంబం రోడ్డున పడుతోంది. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ప్రభుత్వం ఇలాంటి చర్యలు ఆపకపోతే ఉద్యమం తప్పదు.

– నాగరాజన్, సీపీఐ, జిల్లా కార్యదర్శి

ప్రభుత్వానికి దమ్ముంటే పంటను కొనుగోలు చేయాలి



వైఎస్.జగన్ సీఎంగా ఉన్నప్పుడు మార్కెఫెడ్ ద్వారా నల్లబెల్లాన్ని కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచాం. సారాను నివారించడానికి పీడీ యాక్టులు పెట్టాం. కానీ టీడీపీ అధికారంలోకి వస్తేనే బెల్లం రైతులపై పడుతారు. గతంలోనూ అంతే, ఇప్పుడూ అదే కొనసాగుతోంది. మా నియోజకవర్గంలో ఎక్కువ మంది రైతులను అరెస్టు చేశారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే జిల్లాలో బెల్లం రైతులకు ఇబ్బందులు తప్పవు. ఈ ప్రభుత్వానికి దమ్ముంటే నల్లబెల్లానికి గిట్టుబాటు ధర కల్పించి, పంటను కొనుగోలు చేయాలి. – ఎంసీ.విజయానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, చిత్తూరు

వర్సిటీపై ఆశలు..నిరాశేనా?

- ద్రవిడ వర్సిటీకి రూ.5.20 కోట్ల రుణం
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల చెల్లింపులకు అప్పులు
- 10 ఏళ్లలోపు ఆ రుణాన్ని చెల్లించాలి
- జీఓ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆందోళనలో తాత్కాలిక ఉద్యోగులు





వర్సిటీకి రుణాన్ని మంజూరు చేసిన జీఓ కాపీ, ద్రవిడ విశ్వవిద్యాలయం

కుప్పం : ద్రవిడ వర్సిటీకి రూ.5.20 కోట్లు రుణాన్ని మంజూరు చేస్తూ రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ జీఓ విడుదల చేసింది. అయితే ఈ నిధులను వర్సిటీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు చెల్లించుకోమని గానీ ఎక్కడా చెప్పలేదు. పైగా ఈ నిధులను 10 ఏళ్లలోపు మళ్లీ చెల్లించాలని జీఓలో పొందుపరిచారు. కాగా మూడేళ్లలోపు అదనపు బడ్జెట్ కింద నిధులు మంజూరు చేస్తామని.. వీటిని సైతం 10 ఏళ్లలోపు చెల్లించాలని స్పష్టం చేశారు. ఈ నిధులను వర్సిటీలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ జీతాలు చెల్లించేందుకే అని వర్సిటీ అధికారులు స్పష్టం చేశారు. వేతనాలు నేరుగా అందించకుండా అప్పుగా ఇవ్వడంపై ఒప్పంద ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ద్రావిడ విశ్వవిద్యాలయంలో గత సంవత్సర కాలానికి పైగా తాత్కాలిక ఉద్యోగులకు జీతాలు లేక అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వర్సిటీని ప్రక్షాళన చేసి వీరి జీవితాల్లో వెలుగులు నింపుతారని ఆశగా ఎదురు చూసిన ఉద్యోగులకు నిరాశే మిగులుతోంది. మొదట్లో ఆరు నెలల జీతాలు మంజూరు చేసి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం ఏడాదికి పైగా జీతాలు రావాల్సి ఉండగా వర్సిటీ అధికారులు ఉన్నత విద్య శాఖ అధికారులకు నివేదికలు పంపారు. అయితే 235 మందికి ఫైనాన్స్ అప్రూవల్ ఇవ్వడం కుదరదని ఇప్పటికే చేతులెత్తేశారు.

ముఖ్యమంత్రి కుప్పం పర్యటన సందర్భంగా..

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం కుప్పంకు విచ్చేస్తున్న నేపథ్యంలో వర్సిటీలోని హెలీప్యాడ్‌కు చేరుకుని శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ అమ్మవారిని దర్శించుకుంటారు. వర్సిటీలో గత సంవత్సర కాలంగా జీతాలు అందక అవస్థలు పడుతున్న నేపథ్యంలో ఉద్యోగుల నుంచి ఎలాంటి వ్యతిరేకత ఉండకూడదన్న భావనతో వర్సిటీకి రూ.5.20 కోట్లు రుణాన్ని మంజూరు చేస్తూ జీఓను విడుదల చేశారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనీస వేతనాలు అందక

కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా వర్సిటీని అభివృద్ధి చేసి తమ జీవితాల్లో వెలుగులు నింపుతారని ఆశగా ఎదురు చూస్తున్న తాత్కాలిక ఉద్యోగులకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. వీరికి ఎలాంటి అనుమతి ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పడంతో పాటు కనీసం జీతాలను వారికి నేరుగా అందించకుండా వర్సిటీకి అప్పుగా ఇవ్వడంతో ఆందోళనకు గురవుతున్నారు. వర్సిటీ ఏర్పాటుకు భూములు అందించినా కనీస వేతనాలను తమకు అందించకుండా చేస్తుండడంతో తమ భవిష్యత్తు అంధకారం నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పక్కాగా ఖరీఫ్ ప్రణాళిక

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలో పక్కాగా ఖరీఫ్ ప్రణాళిక అమలు చేసి..సాగు విస్తీర్ణం పెంపునకు కృషి చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం చిత్తూరు డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2025–26 ఖరీఫ్‌కు సంబంధించిన ప్రణాళిక ప్రకారం పంట సాగు జరగాలన్నారు. సాగు విస్తీర్ణం పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వేరుశనగ పంట సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చేయాలని కోరారు. అందులో భాగంగా విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా పంట సాగు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక అన్నదాత సుఖీభవ వెబ్‌ల్యాండ్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఏడీఏ సావిత్రి, ఏఓలు శ్రీకాంత్‌రెడ్డి, కళావతి, సుజాత, సంగీత, ఉమశంకరి, వేణు, వరలక్ష్మి, మధు రవాణి, మాధవి, వనిత, వందన, శ్రీనివాసులు, చరిత పాల్గొన్నారు.

గంగమ్మ తేజం



జన సందోహం నడుమ అమ్మవారి శిరస్సు ఊరేగింపు



ఊరేగుతున్న అమ్మవారి శిరస్సు

- వైభవంగా అమ్మవారి ఊరేగింపు
- కిక్కిరిసిన కుప్పం పుర వీధులు
- గంగమ్మ శరణుఘోషతో మార్మోగిన ఆలయం

కుప్పం : కనుచూపు మేర పోటెత్తిన జనం... అమ్మవారి ఊరేగింపు తిలకించేందుకు భక్తులు తరలి రావడంతో పట్టణ పురవీధులు భక్తులతో కిక్కిరిశాయి. కుప్పం చుట్టు పక్కల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటకల నుంచి జనం వాహనాలతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో మే నెల మూడో మంగళవారం నిర్వహించే అమ్మవారికి శిరస్సు తెర తొలగించి ఊరేగించే తంతు మంగళవారం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఉదయం ఆలయం నుంచి అమ్మవారి శిరస్సుకు తెరచుట్టి పెదబావి వద్దకు సంప్రదాయ బద్ధంగా తీసుకొచ్చారు. అక్కడ పెదబావిలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి కండ్ల తెర తొలగించారు. ఈ వేడుకను చూసేందుకు వేలాదిగా జనం రావడంతో కుప్పం కట్టపై జనప్రవాహం నెలకొంది. అక్కడి నుంచి అమ్మవారి పురవీధుల్లో తిరుగుతూ భక్తులకు దర్శనమిచ్చింది.

నేడు విశ్వరూప దర్శనం

అమ్మవారి జాతరలో భాగంగా చివరి రోజు బుధవారం సాక్షాత్కారం కానుంది. శిరస్సు ఊరేగింపు ముగించుకుని అమ్మవారి శిరస్సు ఆలయానికి చేరుకుంటుంది. అమ్మవారి మొండెంపై శిరస్సు ఉంచి అమ్మవారు విశ్వరూప దర్శనాన్ని ప్రజలకు కల్పిస్తారు. ఈ తంతుతో జాతర ముగియనుంది. దీంతో చివరి రోజు విశ్వరూప దర్శనానికి లక్షల మంది జనం వచ్చి దర్శించుకోనున్నారు.

క్లుప్తంగా

వేరుశనగ విత్తన ధర ప్రకటన

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం వేరుశనగ విత్తన కాయల పూర్తి ధరను ప్రకటించింది. కే-6 /టీసీజీఎస్-1694 రకం 30 కిలోల బ్యాగు ధర రూ.9,300, నారాయణి రకం 30 కిలోల బ్యాగు ధర రూ.9500గా నిర్ణయించింది. అయితే రాయితీ ధర ఎప్పుడు ప్రకటిస్తుందోనని రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ రాయితీ ధర ప్రకటించిన తర్వాతే జిల్లాకు కాయలు సరఫరా కానున్నాయని వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు.

పీఎంఏజీవై పనులు పూర్తి చేయండి

చిత్తూరు కార్పొరేషన్ : ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన (పీఎంఏజీవై) పనులు వేగంగా పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు తెలిపారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఎంపీడీఓలతో సమీక్షించారు. ఇందుకోసం జిల్లాలో 23 గ్రామాలు ఎంపిక అయ్యాయన్నారు. ఎంపికై న దళితవాడల్లో పీఎంఏజీవై నిధులతో పాటు, అదనపు నిధులు కలిపి అభివృద్ధి పనులు చేయాలన్నారు. ఇందులో పాఠశాల, అంగన్‌వాడీ, టాయిలెట్స్, కాలువలు, తాగునీరు, రోడ్లు, సోలార్ లైట్స్ వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ ఐసెట్‌లో 941 మంది ఉత్తీర్ణత

చిత్తూరు కలెక్టరేట్ : ఇటీవల నిర్వహించిన ఏపీ ఐసెట్ (ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) పరీక్షల ఫలితాలు మంగళవారం సంబంధిత శాఖ అధికారులు విడుదల చేశారు. ఈ ఫలితాల్లో అర్హత సాధించిన అభ్యర్థులు ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో అడ్మిషన్లు పొందనున్నారు. ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 1,072 మంది దరఖాస్తులు చేసుకోగా 991 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలకు హాజరైన 991 మందిలో 941 మంది ఉత్తీర్ణత సాధించారు. మిగిలిన 50 మంది ఐసెట్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. అదేవిధంగా ఈ పరీక్షల్లో పురుషులు 447 మంది, 494 మంది అర్హత సాధించినట్లు అధికారులు ప్రకటించిన ఫలితాల్లో వెల్లడించారు.

ఎర్ర చందనం పట్టివేత

పుత్తూరు : కేవీబీపురం మండలం రాయల చెరువు సమీపంలో సోమవారం రాత్రి నిర్వహించిన దాడుల్లో ఇద్దరు నిందితులను పట్టుకోవడంతో పాటు 15 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు పుత్తూరు ఫారెస్ట్ రేంజర్ డి.మాధవి తెలిపారు. మంగళవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సోమవారం సాయంత్రం అందిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేయగా కేబీబీపురం మండలం శ్రీనివాసాపురం గ్రామానికి చెందిన పి.చిన్నబ్బ(49), ఎ.తిరుపాల్(45)ను అరెస్ట్ చేశామన్నారు. వీరి వద్ద నుంచి 107 కిలోల బరువు కలిగిన 15 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీని విలువ రూ.67 వేలు ఉంటుందన్నారు. దాడుల్లో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రవిప్రకాష్, బీట్ ఆఫీసర్లు లోకనాథం, సురేష్‌కుమార్, నీలకంఠవాసులు, సదాశివయ్య పాల్గొన్నట్లు వెల్లడించారు.

ఏం సాధించారని వాయిదా!

సంస్కరణల పేరుతో కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న అశాస్త్రీయ విధానాలను క్షేత్రస్థాయిలో టీచర్లు ఎండగడుతున్నారు. టీచర్ల సమస్యలు, డిమాండ్ల పరిష్కారం కాకపోయే సరికి ఈనెల 21వ తేదీన ఉమ్మడి చిత్తూరు డీఈఓ కార్యాలయాలు ముట్టడిస్తామంటూ ఇటీవల అన్ని ఉపాధ్యాయ సంఘాలు ప్రకటించాయి. మంగళవారం ప్రభుత్వం తరపున మరోమారు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోనా శశిధర్ సంఘం నాయకులతో చర్చలు జరిపారు. ఈ చర్చల్లో డిమాండ్‌లు ఏ మాత్రం పరిష్కారం కాకపోయినప్పటికీ ముట్టడి వాయిదా వేస్తున్నట్లు సంఘాల నాయకులు ప్రకటించారు. దీంతో జిల్లాలోని టీచర్లు ఐక్య ఉపాధ్యాయ సంఘం నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏం సాధించారని ముట్టడి వాయిదా వేశారంటూ ప్రశ్నల వర్షం గుప్పిస్తున్నారు.

- సంఘం నేతలపై టీచర్ల మండిపాటు
- చర్చలతో ఒరిగిందేమి లేదంటున్న టీచర్లు
- మోడల్ ప్రైమరీ హెచ్‌ఎంలుగా ఎస్‌ఏల నియామకం అశాస్త్రీయం
- డీఈఓ కార్యాలయాల ముట్టడి వాయిదాపై టీచర్ల ఆగ్రహం



రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చర్చల్లో పాల్గొన్న ఐక్యవేదిక సంఘాల నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వెలుగులు జిమ్ముతున్న విద్యా వ్యవస్థను కారుచీకటిగా మార్చేసింది. తాజాగా పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పేరుతో తొమ్మిది రకాల బడులను తెరపైకి తెచ్చింది. ఈ విధానం వల్ల క్షేత్రస్థాయిలో విద్యార్థులకు, టీచర్లకు తీరని నష్టం కలుగుతున్నప్పటికీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలను పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పేరుతో విలీనం చేసేందుకు కుట్రలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయితే విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి పేద విద్యార్థులు తమ గ్రామాల నుంచి కి.మీ దూరం నడిచి మరొక పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదెక్కడి న్యాయం

కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అమలు చేస్తున్న వింత ధోరణిపై టీచర్లు, తల్లిదండ్రులు, పేద విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీఈడీ చదివిన అభ్యర్థులు ఎస్జీటీ పరీక్ష రాసేందుకు అవకాశం లేదు. అలాంటప్పుడు బీఈడీ చదివి స్కూల్ అసిస్టెంట్‌లుగా విధులు నిర్వహిస్తున్న టీచర్లు ప్రాథమిక పాఠశాలల్లో ఎలా బోధిస్తారని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు.

ముట్టడి వాయిదాపై తీవ్ర విమర్శలు

ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక సంఘం నాయకులు మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో నిర్వహించిన చర్చలతో ఒరిగిందేమి లేదు. అయినప్పటికీ బుధవారం నిర్వహించాల్సిన డీఈఓ కార్యాలయాల ముట్టడిని వెనక్కి తీసుకోవడంపై విమర్శలు గుప్పుమంటున్నాయి. క్షేత్రస్థాయిలో టీచర్ల సంఘ నాయకుల తీరుపట్ల భగ్గుమంటున్నారు.

చర్చలు సాగింది వీటిపైనే..

- క్షేత్ర స్థాయిలో టీచర్లు మ్యాన్యువల్, వెబ్ కౌన్సిలింగ్ అంటూ రెండు గ్రూపులుగా విడిపోయారు. ఈ విధానం కొందరికి నష్టం కానుంది.
- 49 తర్వాత 50 రోల్ ఉంటేనే రెండవ సెక్షన్ అని అన్నారు. దీనివల్ల ఒరిగేది ఏమీ లేదు. ఎందుకంటే అలాంటి స్కూల్స్ చాలా తక్కువగా ఉంటాయి. దీంతో ఉపయోగమేమి లేదు.
- 1,2 తరగతులతో ఉండే ఫౌండేషన్ స్కూల్ లో సంఖ్య 20 దాటిన స్కూల్స్ భూతద్దం పెట్టి వెతికితే మండలానికి ఒకటి, రెండు ఉంటాయి. కొన్ని మండలాల్లో అయితే ఒక్కటీ ఉండే అవకాశం లేదు.
- ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంల విషయంలో పూర్తి స్పష్టత ఇవ్వాల్సి ఉంది.
- ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్య ఇప్పట్లో తేలే అంశం కాదు.. దీంతో ఎన్ని హామీలు ఇచ్చినా నమ్మే ప్రసక్తి లేదని టీచర్లు విమర్శలు గుప్పిస్తున్నారు.
- ఉద్యోగోన్నతుల మాట ఎక్కడా ప్రస్తావించలేదు.
- ఎస్జీటీలకు మాత్రమే మ్యాన్యువల్ కౌన్సెలింగ్ మిగిలిన వారికి వెబ్ కౌన్సెలింగ్ ఇదెక్కడి న్యాయం.

19 డిమాండ్‌లలో కొన్నే పరిష్కారం

ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు 19 రకాల డిమాండ్‌లను కూటమి ప్రభుత్వం దృష్టిలో పెట్టారు. అయితే ఈనెల 20 న నిర్వహించిన చర్చల్లో కొన్ని మాత్రమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అవి కూడా కపట హామీలే. కీలక డిమాండ్‌లైన ఇంగ్లీష్ కు సమాంతరంగా తెలుగు, ఇతర మైనర్ మీడియంలను కొనసాగించి టీచర్లను అలాగే కొనసాగించాలన్న డిమాండ్ ను తిరస్కరించారు. ఉన్నత పాఠశాలల్లో 1:35 నిష్పత్తిని అమలు చేయాలని, 45 మంది విద్యార్థులు దాటాక రెండో సెక్షన్ ఏర్పాటు పైనా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. మోడల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలుగా స్కూల్ అసిస్టెంట్‌లను నియమించడం అశాస్త్రీయం. అయితే ఆ డిమాండ్‌ను పరిష్కరించలేదు.

తాత్కాలికంగా వాయిదా



ఈనెల 21న ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చేపట్టాల్సిన ముట్టడిని తాత్కాలికంగా వాయిదా వేశాం. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన చర్చల్లో కొన్ని డిమాండ్‌లు పరిష్కరిస్తామన్నారు. దీంతో తాత్కాలికంగా వాయిదా వేశాం.

– జీవీ. రమణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, చిత్తూరు జిల్లా.

ప్రభుత్వం మొండి వైఖరి



ప్రస్తుత కూటమి ప్రభుత్వం టీచర్లపై మొండి వైఖరిని ప్రదర్శిస్తోంది. గత ప్రభుత్వం పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెడితే తెలుగు మాధ్యమం, మాతృ భాష తప్పనిసరిగా ఉండాలని అప్పట్లో గగ్గోలు పెట్టారు. ప్రభుత్వం ప్రస్తుతం స్కూల్స్‌లో తెలుగు మీడియం పెట్టేందుకు ఆసక్తి చూపడం లేదు.

– రెడ్డిశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌టీఏ రాష్ట్ర ట్రెజరర్, చిత్తూరు జిల్లా

పిడుగుపాటుకు ఆవులు మృతి

శ్రీరంగరాజపురం : పిడుగుపడి రెండు పాడి ఆవులు మృతి చెందిన సంఘటన మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు కృష్ణమూర్తి కథనం మేరకు అకాల వర్షం కారణంగా ఇంటి పరిసరాలలో చెట్టుకింద రెండు పాడి ఆవులను కట్టి వేయగా వర్షం కారణంగా పిడుగు పడి ఆవులు మృతి చెందాయన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నారు.

ఐసెట్‌లో తిరుపతి విద్యార్థుల హవా



వి.అజయ్‌కుమార్, మహేంద్రసాయి

తిరుపతి సిటీ: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల పరిధిలో ఏంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో అడ్మిషన్లు పొందేందుకు నిర్వహించిన ఐసెట్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐసెట్‌కు తిరుపతి జిల్లా వ్యాప్తంగా 2,759 మంది విద్యార్థులు హాజరుకాగా 2,627 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో పురుషులు 1296 మంది, 1331 మంది మహిళలు ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాదిలాగే ఈ ఏడాది జిల్లాలో మహిళలదేపైచేయిగా నిలిచింది.

7, 10 ర్యాంకులు సాధించిన జిల్లా విద్యార్థులు

ఐసెట్ ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా టాప్‌టెన్‌లో 7వ, 10వ ర్యాంకులను తిరుపతి జిల్లాకు చెందిన విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఇందులో తిరుపతి నగరం సమీపంలోని వేదాంతపురానికి చెందిన వి అజయ్‌కుమార్ 7వ ర్యాంకు సాధించారు. ఈయన శ్రీసిటీ ఐఐఐటీలో బీటెక్ పూర్తి చేశారు. అజయ్‌కుమార్ తండ్రి వి మదన మోహన్ గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. సూళ్లూరు పేట, మన్నూర్‌పోలూరుకు చెందిన మహిళా రైతు లక్ష్మీ కుమారుడు మహేంద్ర సాయి 10వ ర్యాంక్ సాధించాడు. ఈ విద్యార్థి ఆంధ్ర యూనివర్సిటీలో ఇటీవల బీటెక్ పూర్తి చేశాడు.

కిలాడీ బావా బామ్మర్దులు

- చైన్ స్నాచింగ్‌లో దిట్టలు
- మూడు నెలల్లో ఆరుచోట్ల అపహరణ
- 152 గ్రాములు బంగారు చైన్లు, బైక్ స్వాధీనం
- సిబ్బందిని అభినందించిన డీఎస్పీ ప్రభాకర్

చౌడేపల్లె : బావ బామ్మర్దులు డ్రైవింగ్ వృత్తిలో ప్రావీణ్యం కలిగి జల్సాలకు అలవాటు పడ్డారు. అదే వృత్తిలో కొనసాగకుండా అక్రమ మార్గంలో సులభంగా డబ్బు సంపాదించాలని అత్యాశకు పోయి పోలీసుల వలకు చిక్కి కటకటాలపాలయ్యారు. వీరు వృద్ధులు, రోడ్లపై తిరుగుతున్న ఒంటరి మహిళలనే లక్ష్యం చేసుకొని చైన్‌స్నాచింగ్ పాల్పడుతున్న ఇద్దరు ఘరానా కిలాడి బావ బామ్మర్దును అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ మంగళవారం సీఐ రాంభూపాల్‌తో కలిసి మీడియాకు వివరించారు.

పట్టుబడింది ఇలా..

ఈ ఘటనలపై సీఐ రాంభూపాల్ ఐడీ పార్టీలతో కలిసి ప్రత్యేక బృందంగా ఏర్పడ్డారు. ప్రత్యేక నిఘా, సాంకేతిక పరిజ్ఞానంతో వంగసానిపల్లె వద్ద చెన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు దొంగలను గుర్తించారు. అన్నమయ్య జిల్లా పీటీఎం మండలం రాపూరువాండ్లపల్లె డి. నారాయణపల్లెకు చెందిన నారాయణ కుమారుడు పెద్దశెట్టి శంకర, మదనపల్లె టౌన్ బసినికొండకు చెందిన రఘు కుమారుడు సదనాల హరిగా పోలీసులు గుర్తించి నిర్ధారించారు.

మూడు నెలల్లో ఆరుచోట్ల..

బావబామ్మర్దులు చైన్ స్నాచింగ్ వృత్తిలో మూడు నెలల్లో ఆరుచోట్ల పాల్పడ్డారు. సోమల, నిమ్మనపల్లె, గంగవరం, చిన్నమండెం, పెద్దమండెం, గాలివీడు ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వారి వద్ద రూ.10 లక్షలకు పైగా విలువ చేసే 152 గ్రాముల నగలతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసులకు రివార్డులు

నేరం జరిగిన నెలరోజుల్లోపే దొంగలను చాకచక్యంగా అదుపులోకి తీసుకోవడంలో ప్రతిభ చూపిన సీఐ రాంభూపాల్, ఎస్ఐ శివశంకర్ , ఏఎస్ఐ శ్రీనివాసులునాయుడు, కానిస్టేబుళ్లు అల్లావుద్దీన్, శశిధర్, యల్లప్పకు రివార్డులు అందజేసి డీఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రభాకర్ మాట్లాడుతూ...నేరాల నియంత్రణకు పోలీసులకు , మీడియా, ప్రజల సహకారం అవసరమన్నారు. నాటు సారా, గంజాయి, పేకాటపై సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

అసలేం జరిగిందంటే...

సోమల మండలం ఆవులపల్లె పంచాయతీ వంగసానిపల్లె వద్ద ఏప్రిల్ 21వ తేదీన సంపూర్ణమ్మ పంట పొలం వద్దకు ఒంటరిగా వెళ్తుండగా గుర్తు తెలియ ని ఇద్దరు వ్యక్తులు బైక్ మీద ఆమె వద్దకు వచ్చారు..మాటలు కలిపారు. ఎవరు రోడ్డుపైలేనిది చూసి ఆమె మెడలోని సుమారు 32 గ్రాముల బంగారు చైనుతో ఉడాయించారు. ఆమె అదే రోజు సోమల పోలీసులకు చైన్ స్నాచింగ్‌పై ఫిర్యాదు చేసింది.

మార్కులు కాదు.. మార్పు తేవాలి!

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో 11 అంశాలపై సర్వే
- నాలుగు రోజుల క్రితం రాష్ట్రశాఖ మార్కుల వెల్లడి
- 76.36 మార్కులతో జిల్లా వెనకడుగు



యాదమరి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముఖం చాటేస్తున్నారు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో 50 పీహెచ్‌సీలున్నాయి. ఏడాది క్రితం వరకు రోజువారీగా ఒక్కో పీహెచ్‌సీకి 100 నుంచి 150 వరకు ఓపీలొచ్చేవి. ఇప్పుడు ఈ సంఖ్య తగ్గుముఖం పట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య ఆరోగ్య సేవలు గాలిలో దీపంలా మారాయి. క్షేత్ర స్థాయిలో తూతూమంత్రంగా వైద్య సేవలు అందుతున్నాయి.

వదలని నిర్లక్ష్యపు జబ్బు

మాతా శిశు సంక్షేమ కార్యక్రమాల విషయాన్ని జిల్లాలోని వైద్యులు, సిబ్బంది పూర్తిగా గాలికొదిలేశారు. గర్భిణుల గుర్తింపులో నిర్లక్ష్యం చేస్తున్నారు. హైరిస్క్ కేసుల విషయంలో చూసీచూడనట్లు ఉండిపోతున్నారు. ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్య సేవలందించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. పీహెచ్‌సీలో సుఖ ప్రసవాలు చేయాలనే లక్ష్యాన్ని అలక్ష్యం చేస్తున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలో మాతా శిశు మరణాలు సంభవిస్తున్నాయి.

పీహెచ్‌సీకి వచ్చే రోగులపై వైద్యులు, సిబ్బంది ముఖం చాటేస్తున్నారు. మధ్యాహ్నంపైగా పలు చోట్ల డాక్టర్లు ఉండడం లేదు. మీటింగ్‌ల పేరుతో డుమ్మా కొడుతున్నారు. కొందరు యూనియన్ పేర్లు చెప్పుకుని కాలయాపన చేస్తున్నారు. దీంతో పీహెచ్‌సీల్లో అరకొర వైద్య సేవలందుతున్నాయి. వచ్చిన వారికి కొన్ని మందు బిల్లలు ఇచ్చి పంపించేస్తున్నారు. చాలా చోట్ల వైద్య సేవలు కనుమరుగవుతున్నాయి. సీజనల్ వ్యాధుల సమయంలో అధికారులు, సిబ్బంది చోద్యం చూస్తున్నారు.

పనితీరుకు ఒక మార్కు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో అందించే సేవలు, పనితీరు ఆధారంగా జిల్లాలకు మార్కులు కేటాయించారు. సీజనల్ వ్యాధుల కట్టడి నుంచి మాతా శిశు ఆరోగ్యం వరకు 11 అంశాల్లో సంతృప్తి స్థాయి, లోటుపాట్లను లెక్కించారు. జిల్లా వారీగా మార్కులను ప్రకటించారు. ఈ ర్యాంకుల్లో చిత్తూరు జిల్లా 76.36 మార్కులతో వెనకబడింది. కొన్ని సేవల్లో పర్వాలేదనిపించింది.

తప్పుల తడక

వైద్య, ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. వీటిని ఫొటోలతో సరిపెట్టేస్తున్నారు. చాలాచోట్ల ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు విదులకు పంగనామాలు పెడుతున్నారు. సర్వేలను సాకుగా చూపించి వైద్య ఆరోగ్య సేవలను పూర్తిగా పక్కన పెట్టేశారు. ఎన్‌సీడీ సర్వేలన్నీ కూడా తప్పుల తడకగా ఉన్నాయి. ఇష్టానుసారంగా ఇంట్లోనే కూర్చుని సర్వేలను పూర్తి చేస్తున్నారు. అసంక్రమిత వ్యాధిగ్రస్తులను, అనుమానిత కేసులను గుర్తించడంలో విఫలమవుతున్నారు. సర్వేలో బతికున్నవాళ్లను కూడా చంపేస్తున్నారు. దీంతో ఈ సర్వే తప్పుల తడకగా ఉందని రాష్ట్ర స్థాయి అధికారులు గుర్తించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటికొచ్చి వైద్య సేవలందిస్తున్నారనే విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు మార్కులతో సరిపెట్టొద్దని..మార్పు తీసుకోరావాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

11 అంశాల వారీగా కేటాయించిన మార్కులు

అంశం	మార్కులు
గర్భవతుల సేవలు –	12.07
శిశు సంక్షేమం, రొటీన్ టీకాలు –	8.15
కుటుంబ నియంత్రణ –	2.06
విలేజ్ హెల్త్ క్లినిక్‌లు –	9.87
సంక్రమిత, అసంక్రమిత వ్యాధులు –	5.70
ఆర్‌బీఎస్‌కే –	3.53
జాతీయ ఆరోగ్య మిషన్ –	8.20
ఆస్పత్రుల నాణ్యత, సేవలు –	1.86
అభ(అయుష్మాన్ భారత్), అటెండెన్స్ –	4.95
సీజనల్ వ్యాధులు –	9.14
నిధుల కేటాయింపు –	4.35

నిర్లక్ష్యమంటే కుదరదు



పీహెచ్‌సీలో వైద్య సేవలు పక్కాగా అమలు చేస్తున్నాం. విధుల్లో అలసత్వం వహిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకోను. కచ్చితంగా నిర్ణీత సమయంలో వైద్యు లు అందుబాటులో ఉండాలి. ఆరోగ్య, వైద్యసేవలను పల్లెల్లో విస్తృతం చేయాలి. గర్భవతుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. సీజనల్ వ్యాధుల కట్టడికి చ ర్యలు తీసుకుంటాం. అధికారులు, సిబ్బంది మారాలి. సేవల్లో మెరుగైన మార్పులు కనబరచాలి.

– సుధారాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

'కుంకీల'తో కట్టడయ్యేనా!

- రేపు జిల్లాకు కుంకీ ఏనుగులు
- క్యాంపులో పూర్తిస్థాయిలో జరగని పనులు
- రవాణాకు అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు
- 22వ తేదీకి పలమనేరు క్యాంపు చేరేలా ఏర్పాట్లు

పలమనేరు/చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలోని కౌండిన్య అభయారణ్యంలో ఏనుగుల సమస్య దశాబ్దాలుగా ఉంది. అడవిని దాటుతున్న ఏనుగులు రైతుల పంటలను నాశనం చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం కుంకీ ఏనుగుల ద్వారా ఇక్కడి ఏనుగులను కట్టడి చేసేందుకు పలమనేరు మండలంలోని మొసలిమడుగు వద్ద కుంకీ ఎలిఫెంట్ ప్రాజెక్టు పనులను చేపడుతోంది. ఇందులో భాగంగా కర్ణాటక రాష్ట్రం నుంచి ఆరు కుంకీ ఏనుగులు గురువారం పలమనేరు ఎలిఫెంట్ క్యాంపునకు చేరుకోనున్నాయి.

కూటమి ప్రభుత్వం కుంకీ ఏనుగుల కోసం కర్ణాటక రాష్ట్రంతో ఎంఓయూ చేసుకొంది. అందులో భాగంగా బుధవారం సాయంత్రం కర్ణాటక నుంచి మన రాష్ట్రానికి కుంకీలను అందించనున్నారు. అక్కడ నుంచి సాయంత్రం అవి ప్రత్యేక వాహనంలో బయలుదేరనున్నాయి. విద్యుత్ లైన్లు తగలకుండా రవాణా సమయంలో సరఫరా ఆపివేయాలని అటవీ అధికారులు ట్రాన్స్‌కో అధికారులను కోరారు. గురువారం సాయంత్రంలోపు పలమనేరు ఎలిఫెంట్ క్యాంప్‌కు వీటిని తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.



క్రోల్స్‌నివాస స్థలం



మొసలిమడుగు ఎలిఫెంట్ క్యాంపునకు వస్తున్న కుంకీ ఏనుగులివే

6 ఏనుగుల పేర్లు ఇలా..

6 కుంకీ ఏనుగులను కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎంలు..ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు బుధవారం ఏనుగులను అందజేయనున్నారు. మాస్తి, దేవ, రంజన్, కరుణా, కృష్ణ, అభిమన్యు అనే పేర్లు గల కుంకీ ఏనుగులను ఏపీకి పంపనున్నారు.

ఏనుగుల గుంపు వచ్చినప్పుడు..

ఏనుగుల గుంపు దాడికి దిగినప్పుడు కుంకీలను రంగంలోకి దింపుతారు. ఏనుగులను తరిమికొట్టడంలో ఇవి కీలక భూమిక పోషిస్తాయి. కొన్ని సార్లు గాయపడిన లేదా చిక్కుకున్న అడవి ఏనుగునే రక్షించడానికి వీటిని ఉపయోగిస్తారు.

మేతపై తప్పని గుబులు

- సాధారణంగా ఓ కుంకీ ఏనుగు రోజుకి 900 లీటర్ల నీరు, 10 హెక్టార్లలో మేత అవసరం ఉంది. ఆహారం తిన్నాక ఇవి రోజుకు 5 మైళ్ల దాకా సంచరిస్తుంటాయి. వీటికి మేతగా రావి, మర్రి, జువ్వి, వెదరు, నేపియర్ గడ్డి, చెరుకు, అరటి మేతగా కావాలి. కానీ ఇవన్నీ ఇక్కడ ఇంకా సిద్ధం కాలేదు. మరోవైపు వంద ముద్దల రాగి సంగటి, బెల్లంతో కలిపిన వరిధాన్యం, వరిగడ్డి ఉండలను పొద్దున పెట్టాలి. ఈ నాలుగు ఏనుగుల మేత కోసమే నెలకు రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది.
- జిల్లాకు రానున్న కుంకీలను పలమనేరు మొసళ్లమడుగు ఎలిఫెంట్ క్యాంపులో పెట్టనున్నారు. ఇందుకోసం అటవీ సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎఫ్ఓ భరణి తెలిపారు. కొద్ది రోజులు కర్ణాటక మావటిలు జిల్లా వాతావరణం ఏనుగులు అలవాటు పడే వరకు ఇక్కడ ఉంటారు. ఏనుగులను మచ్చిక చేసుకొని వాటికి తగిన శిక్షణ ఇచ్చి రంగంలోకి దింపనున్నట్లు డీఎఫ్ఓ భరణి తెలిపారు.



కుంకీ ఏనుగుల కోసం నిర్మించిన చెరువు